గృహసారథులే పార్టీకి రథసారథులు

- టీడీపీ తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలి
- సమన్వయ సమావేశాల్లో ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పరిశీలకుడు సూర్యనారాయణరాజు



ఎల్.ఎన్.పేట: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట/కొత్తూరు/హిరమండలం: గృహ సారథులు, జగనన్న సచివాలయం కన్వీనర్లు పార్టీకి, ప్రభుత్వానికి వారథులుగా పనిచేసి రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎంగా చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, నియోజవర్గ పరిశీలకుడు ఎమ్మెల్సీ పీవీవీ సూర్యనారాయణరాజు పిలుపునిచ్చారు. ఎల్.ఎన్.పేట మండలం కోవిలాం కాలనీ వద్ద గృహ సారథులు, గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో గురువారం సమన్వయం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలతో పనిలేకుండా అర్హులందరికీ పథకాలు అందేలా బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతీ ఇంటి తలుపుపైన, స్మార్ట్‌ఫోన్‌పైన వారి అనుమతితో జగనన్న నువ్వే మా నమ్మకం స్టిక్కర్లు అతికించాలన్నారు. గత పాలనతో పోల్చితే జగనన్న పాలనలో మంచి జరిగిందని, రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు, కుటుంబాలకు, కులాలకు మంచి జరిగిందని వివరించాలన్నారు. ఈ పథకాలన్నీ భవిష్యత్‌లోనూ కొనసాగించాలంటే మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలన్నారు. ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన లాంటి పార్టీ నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, వైస్ ఎంపీపీ శివ్వాల ఇందమ్మ, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, పార్టీ నాయకులు శిమ్మ సాంబశివరావు, ముగడ జనార్దన, కొల్ల రాము, కెల్ల గణపతి, తలసముద్రం శోభన్ బాబు, బలగ గోవిందరావు, కొల్ల లక్ష్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

● కొత్తూరులోనూ గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు, గ్రామ వలంటీర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పరిశీలకుడు సూర్యనారాయణరాజులు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున కొందరు టీడీపీ నేతలు ప్రలోభాలకు గురి చేస్తారని, వారిని తరిమికొట్టాలను పిలుపునిచ్చారు. తన ప్రాణం ఉన్నంత వరకు పాతపట్నం నియోజవర్గం అభివృద్ధి కోసం ప్రతి నిత్యం పాటు పడతానని ఎమ్మెల్యే రెడ్డి శాంతి స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయం మండల కన్వీనర్ కామక త్రినాథరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు చింతాడ సూర్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ గోగుల మాధవి, పారాపురం సర్పంచ్ కుంచాల రత్నాలు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నందకుమార్, నాయకులు గండివలస రత్నకుమారి, లోతుగెడ్డ తిరుపతిరావు, గోగుల వరప్రసాదరావు, బూర్లె శ్రీనివాసరావు, మొజ్జాడ చక్రపాణి, గండివలస ఆనందరావు, కొంచాడ వెంకటరమణ, మండా రామ్మూర్తి పంతులు, మెండ సుదర్శనరావు, సారిపల్లి తిరుపతిరావు, రాజులు నాయుడు, కంచాల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

● ప్రతిపక్షాలు చేసే కుట్రలు, కుతంత్రాలను సమర్థంగా ఎదుర్కొని ప్రజలకు జగనన్న ప్రభుత్వం చేసిన మేలును వివరించి వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపునిచ్చారు. నూతనంగా నియమితులైన జగనన్న గృహ సారథులు, కన్వీనర్లకు గురువారం హిరమండలంలోని పద్మావతి కల్యాణ మండపంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 27 వరకు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల వెంకటరామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎ.వి.సురేష్, హిరమండలం సర్పంచ్ డి.సుందరమ్మ, ఉప సర్పంచ్ వి.బాలరాజు, నాయకులు మీసాల రామారావు, చిన్నయ్య, దండాసి తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: మాట్లాడుతున్న పాతపట్నం నియోజకవర్గ పరిశీలకుడు సూర్యనారాయణరాజు



హిరమండలం: పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



హిరమండలంలో ఎరువుల దుకాణం రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ మధుబాబు

హిరమండలం: అనుమతి లేని పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని పలాస వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) ఎల్.వి.మధుబాబు అన్నారు. గురువారం హిరమండలంలోని ఎరువుల షాపులను తనిఖీచేశారు. స్టాక్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల వ్యాపారం చేసే ప్రతి ఒక్కరూ విధిగా లైసెన్సు, జీఎస్టీ కలిగి ఉండాలన్నారు. కాలం చెల్లిన లైసెన్సులతో వ్యాపారం చేయకూడదన్నారు. స్టాక్ రిజిస్టర్ ప్రకారం నిల్వలు సరిపోవాలన్నారు. రైతులకు విధిగా బిల్లుల రసీదు ఇవ్వాలని, ఈ పాస్ నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.సంధ్య పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి



చేపలు విడిచిపెడుతున్న మత్స్యశాఖ ఏడీ సత్యనారాయణ

ఎల్.ఎన్.పేట: మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మత్స్యశాఖ ఏడీ(పలాస) వై.సత్యనారాయణ తెలిపారు. ఎల్.ఎన్.పేట మండలం పెద్దకొల్లివలస పంచాయతీ వెంకంపేట జాలారివాని చెరువులో 44 వేల చేపపిల్లలను గురువారం విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు నిధులతో ఏపీ ఐఐఏటీపీ పథకంలో భాగంగా మత్స్యకారులను ప్రోత్సహించేందుకు ఉచితంగా చేప పిల్లలను అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హిరమండలం ఏఐఎఫ్ కె.రవికుమార్, వీఎఫ్ఏ రమేష్, పెద్దకొల్లివలస గ్రామ సచివాలయ మత్స్యశాఖ సహాయకులు ఐ.శ్రావ్య, మత్స్యకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ఆహార సేవ



పౌష్టికాహారం అందజేస్తున్న సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు

ఆమదాలవలస: మెట్టక్కివలసనలోని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కన్నేపల్లి వెంకట కామావధానుల ఆధ్వర్యంలో పూజారిపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రధానమంత్రి మాతృ సంరక్ష పథకం కింద వైద్యపరీక్షలకు వచ్చిన గర్భిణులకు గురువారం ఆహార సేవ నిర్వహించారు. పౌష్టికాహారాన్ని అందజేసి ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సమితి మహిళా ఇన్‌చార్జి ఎ.రామలక్ష్మి, హిరమండలం వృద్ధాశ్రమం ఇన్‌చార్జి కె.ప్రహ్లాదరావు, జిల్లా మెడికల్ ఇన్‌చార్జి డాక్టర్ పి.తాతయ్య, సభ్యులు ఎ.శేషగిరి, కె.శాంతి, గంగాధర్, బి.విశ్వనాథం, రమణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న సభ్యులు

బూర్జ: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు వై.లింగరాజు అన్నారు. గురువారం బూర్జ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు హాజరువుతున్న విద్యార్థులు భయాన్ని వీడి ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ, సాయి సంస్థల జోనల్ బాలవికాష్ ఇన్‌చార్జి కర్నేన దీప, జోనల్ కన్వీనర్, ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు, జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, సేవా సంస్థల అభివృద్ధి ఇన్‌చార్జి పడాల ప్రసాద్, జిల్లా విద్యాజ్యోతి ఇన్‌చార్జి ఎం.జనార్దనరావు, హెచ్ఎం డి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ ప్రతినిధులు

కొత్తూరు: కొత్తూరులో గురువారం పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ మండల అధ్యక్ష కార్యదర్శులు రుషిదాస్, చంద్రకాంత్‌లు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్నామని చెప్పారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎల్.లక్ష్మణరావు, ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు ఎస్.ధర్మారావు, నాగభూషణరావు, ఉషారాణిలను సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నేతలు ఎం.ప్రఫుల్లకుమార్, వి.ప్రసాదరావు, శివకృష్ణ, ఎల్.నారాయణరావు, చంద్రరావు, సుధాకరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి



డీటీ బాలకృష్ణను సత్కరిస్తున్న దృశ్యం

కొత్తూరు: అంకితభావంతో సేవలందిస్తే తప్పక గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ పి.బాల అన్నారు. కొత్తూరు తహశీల్దార్ కార్యాలయంలో ఉప తహశీల్దార్‌గా పనిచేసి ఇచ్ఛాపురం ఎంఎల్ఎస్ పాయింట్‌కు ఇన్‌చార్జిగా బదిలీపై వెళ్లిన కె.బాలకృష్ణను గురువారం సత్కరించారు. కార్యక్రమంలో డీటీ బి.వెంకటరమణ, ఏఎస్‌వో బాలరాజు, ఆర్ఐ గిరిష్ కుమార్ పట్నాయక్, ఎన్‌జీవో తాలూకా సంఘం అధ్యక్షుడు అల్లు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



విచారణ చేపడుతున్న డీఎస్పీ శివరామి రెడ్డి

కొత్తూరు: మండలంలోని ఓంద్రుజోలకు చెందిన సీహెచ్ శేషమ్మ అదే గ్రామానికి చెందిన భీమవరపు కృష్ణ, నర్సమ్మ, వెంకటేష్‌లపై భూమి వివాదంపై ఈ నెల 7న పోలీసులకు అట్రాసిటీ ఫిర్యాదు చేశారు. భూముల రీ సర్వే సందర్భంగా భూమి తమదంటూ వచ్చి దాడి చేసి గాయపరిచారని శేషమ్మ ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు గురువారం టెక్కలి డీఎస్పీ శివరామి రెడ్డి ఓంద్రుజోల వెళ్లి విచారణ చేపట్టారు. ఆయనతో పాటు సీఐ వేణుగోపాలరావు, ఎస్ఐ ఎం.గోవింద, సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా గోరుముద్ద మెనూ అమలు



వంటకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ బాలరాజు

సరుబుజ్జిలి: జగనన్న గోరుముద్ద మెనూ విషయంలో జీపడవద్దని ఎంఈఓ డి.బాలరాజు అన్నారు. సరుబుజ్జిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న గోరుముద్ద కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. వంటలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బొత్స వెంకటరమణ, సీఆర్‌పీలు బెండి చిన్నారావు, రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మెనూ పాటించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, సంక్షేమ హోమ్‌లలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూను విధిగా అమలు చేయాలని, ప్రతి నెలా ఆరోగ్య తనిఖీలు చేయించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు ఆదేశించారు. గురువారం జిల్లా న్యాయ న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం న్యాయ సేవాసదన్‌లో జిల్లా ట్రైబల్, బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్ మెనూ, వసతి సౌకర్యాలపై సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్.గడ్డమ్మ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనురాధను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇకపై ప్రతి నెలా వెల్ఫేర్ హాస్టల్స్ వెల్ఫేర్ హోమ్స్‌ను సందర్శిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

ఉగాదికి గృహ ప్రవేశాలు



మాట్లాడుతున్న మెప్మా పీడీ కిరణ్‌కుమార్

ఆమదాలవలస: వైఎస్ఆర్ జగనన్న కాలనీ లే అవుట్లలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది ఉగాది నాడు నిర్వహించనున్న సామూహిక గృహ ప్రవేశాలకు తగు చర్యలు చేపట్టాలని మెప్మా పీడీ, గాజులకొల్లివలస లే అవుట్ ప్రత్యేకాధికారి ఎం.కిరణ్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఆమదాలవలస మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కె.అప్పలనాయుడు ఆధ్వర్యంలో వార్డు సచివాలయ ఎమినిటీస్ కార్యదర్శులు, మెప్మా సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు కోరితే రూ.35 వేలు అదనపు రుణం కల్పిస్తామని చెప్పారు. తిమ్మాపురం, గాజులకొల్లివలస, చింతాడ లే అవుట్లలో అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



ఆస్పత్రిలో పౌష్టికాహారం అందిస్తున్న డాక్టర్ అనిత



పౌష్టికాహారం అందిస్తున్న సమితి సభ్యులు

పాతపట్నం: పాతపట్నం సీహెచ్‌సీలో నవజీవన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు గురువారం భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.అనిత మాట్లాడుతూ గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. సమతుల్య ఆహారం తీసుకున్నప్పుడే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు సందీప్, సునీత, లిఖిత, నవజీవన్ నిర్వాహకులు నరసింహారెడ్డి పాల్గొన్నారు.

పొందూరు: స్థానిక సీహెచ్‌సీలో 27 మంది గర్భిణులకు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహారం అందజేశారు. పులిహోరా, పెరుగన్నం, పికిల్, పండ్లు అందజేశారు. ప్రతినెలా 9న ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ రాధాకృష్ణ, సభ్యులు తెలిపారు.

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



చాపర పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీతులసి

మెళియాపుట్టి: గర్భిణుల ఆహార నియమాలపై వైద్యులు దృష్టి సారించి పౌష్టికాహార లోపం లేకుండా చూడాలని శ్రీకాకుళం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, జిల్లా ఫ్యామిలీ ఫిజీషియన్ నోడల్ అధికారి లక్ష్మీ తులసి అన్నారు. గురువారం చాపర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి గర్భిణులకు సూచనలు, సలహాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలోనే ప్రసవం జరిగేలా క్షేత్రస్థాయిలో సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. ఆస్పత్రి పరిసరాలు, సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ హేమంత లక్ష్మీ, డాక్టర్ పావని, హెల్త్ అసిస్టెంట్ ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించడమే ధ్యేయం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కమిషన్ సభ్యుడు కాంతారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యుడు బి.కాంతారావు అన్నారు. ఆహార భద్రత చట్టం అమలు తీరు పర్యవేక్షణ నిమిత్తం గురువారం జిల్లా కేంద్రంలోని రేషన్ షాపు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. వాంబే కాలనీ వద్ద ఎండీయూ వాహనంలో విక్రయిస్తున్న బియ్యాన్ని పరిశీలించిన ఆయన.. సిబ్బందితో మాట్లాడుతూ చిన్న చిన్న పొరపాట్లు సైతం పునరావృతం కాకూడదన్నారు. వాహనంలో నిల్వలు, గొడౌన్ స్టాక్ పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. గూనపాలెం సెక్టార్, దండి వీధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. పిల్లలకు తయారు చేసిన ఆహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వప్పంగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. పేదరికంతో చదువులకు దూరం కాకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నారని చెప్పారు. పోషక విలువలతో కూడిన పోర్టి ఫైడ్ రైస్‌ను విద్యార్థుల కోసం అందిస్తున్నట్లు వివరించారు. పట్టుదలతో చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ఆహార సమస్యలు ఏమైనా ఉంటే 9966242414 నంబర్‌కు తెలియజేయవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సరఫరా చేసే అక్షయపాత్ర సెంట్రలైజ్డ్ కిచెన్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ జయంతి, డీఎస్‌ఓ డి.వెంకటరమణ, జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ కె.అనంతలక్ష్మి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి, డీటీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



మట్టి నమూనాలు సేకరిస్తున్న విద్యార్థులు

సరుబుజ్జిలి: భూసార పరీక్షలు తప్పకుండా చేసుకోవాలని నైర వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు సూచించారు. అవతరాబాద్ గ్రామానికి చెందిన రైతు గండివలస విష్ణు పొలంలో గురువారం మట్టి నమూనాలు సేకరించారు. భూసార ఫలితాల ఆధారంగా తదుపరి ఎరువులు వినియోగించాలని సూచించారు. మట్టి నమూనా పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు సూర్యనారాయణ, ధనరాజ్, అహమ్మద్, సుధాకర్ పాల్గొన్నారు.

కొత్తూరు డీటీగా వెంకటరమణ



బాధ్యతలు స్వీకరించిన వెంకటరమణ

కొత్తూరు: కొత్తూరు మండల ఉప తహశీల్దార్‌గా బి.వెంకటరమణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా తహశీల్దార్ బాలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారులు, సిబ్బంది సహకారంతో బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానని తెలిపారు.

మద్యం అక్రమ రవాణాపై నిఘా



వసుంధరలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఈబీ ఎస్ఐ రాజశేఖర్

మెళియాపుట్టి: ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లో వాహనాల రాకపోకలపై నిఘా పెంచినట్లు ఎస్ఈబీ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. వసుంధర చెక్‌పోస్టు వద్ద గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు మద్యం అక్రమ రవాణా, విక్రయాలు జరగకుండా నిఘా పెట్టినట్లు తెలిపారు. అనుమతి లేకుండా మద్యం తీసుకొస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

మెళియాపుట్టి: మెళియాపుట్టి మండలం పట్టుపురం కూడలిలో గురువారం 30 మద్యం బాటిళ్లు తరలిస్తూ నందిగాం మండలం బెనియాడూరు గ్రామానికి చెందిన నరసింహులు పట్టుబడినట్లు ఏఎస్సై అప్పన్న తెలిపారు. కేసు నమోదు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

సారవకోట: కోటబొమ్మాళి మండలం తాటిపురం గ్రామానికి చెందిన సాధు ఈశ్వరరావు కుటుంబ సభ్యులకు సారవకోట మండలం అలుదు గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్టు సభ్యులు రూ.24 వేలు సాయాన్ని గురువారం అందించారు. ఈశ్వరరావుకు 15 రోజుల క్రితం పాప పుట్టి వింత వ్యాధి సోకి వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకుని ఈ మొత్తం వితరణగా అందజేశారు.

ఆర్‌పీ ఫౌండేషన్ ఔదార్యం



సాయం అందజేస్తున్న ఎస్సై, ఫౌండేషన్ సభ్యులు

సరుబుజ్జిలి: రేపటి ప్రయోజనం(ఆర్పీ ఫౌండేషన్) సరుబుజ్జిలి యువత మరోసారి మానవత్వం చాటుకున్నారు. సారవకోట మండలం తాటిపరుపు గ్రామానికి చెందిన సాధు ఈశ్వరరావు, అనూరాధ దంపతుల బిడ్డ అరుదైన వ్యాధితో బాధపడుతున్నట్లు తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు కుటుంబ సభ్యులను సరుబుజ్జిలికి పిలిపించి తక్షణ సాయం కింద రూ.8వేలను ఎస్సై కూటికుప్పల కృష్ణప్రసాద్ చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాదు, గొండు శ్రీనివాసరావు, ఫౌండేషన్ సభ్యులు బాన్న భార్గవ్, నూక కిరణ్, దివ్య, పావని పాల్గొన్నారు.

విత్తనాభివృద్ధికి సహకరించండి



రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త అనూష

నరసన్నపేట: విత్తనోత్పత్తికి వీలుగా ప్రభుత్వం అనేక పథకాలు నిర్వహిస్తోందని, వీటిని రైతులు గమనించి విత్తనోత్పత్తికి సహకరించాలని ఆమదాలవలస కేవీకే శాస్త్రవేత్త అనూష అన్నారు. కిల్లాంలో గురువారం రైతులకు విత్తనోత్పత్తి పథకాలు , పంటల్లో మెలకువలపై అవగాహన శిబిరం నిర్వహించారు. విత్తనాలకు డిమాండ్ ఉన్నందున తమకు తాముగా విత్తనోత్పత్తికి కృషి చేయాలని, ప్రభుత్వ ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటరావు, ఏఓ సూర్యకుమారి, ఏఈఓ అమరావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



సూచనలిస్తున్న ఎంఈఓ రాంబాబు

హిరమండలం: పదో తరగతి విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా చదవాలని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. తంప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఫార్మెటివ్–3 పరీక్షలను గురువారం పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయనతో పాటు సీఆర్‌పీలు ఉన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



బోర్డు స్కూల్లో విద్యార్థులకు కంటి తనిఖీలు చేస్తున్న సిబ్బంది

నరసన్నపేట: దృష్టి లోపంతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా పోలాకి పీహెచ్‌సీ ఆప్తాలమిక్ అసిస్టెంట్ బాల గంగాధర్ గురువారం నరసన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బోర్డు), ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల కళ్లను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యవరం, మాకివలస ఉన్నత పాఠశాలల్లో తనిఖీలు పూర్తయ్యాయని, మొత్తం దృష్టి లోపంతో ఉన్న 112 మంది విద్యార్థులను గుర్తించామని చెప్పారు.

11న నీలమణిదుర్గ పండగ సమావేశం

పాతపట్నం: పాతపట్నంలో వెలసిన నీలమణి దుర్గ అమ్మవారి పెద్ద పండగ సమావేశం జగన్నాథ ఆలయం(మఠం)లో శనివారం సాయంత్రం నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు ఒక ప్రకటనలో తెలిపారు. కరోనా వల్ల రెండేళ్ల పండగ చేయలేకపోయమని, ఈ నేపథ్యంలో పండగ తేదీలు నిర్ణయించేందుకు జరిగే ఈ సమావేశానికి పాతపట్నం గ్రామపెద్దలు విధిగా హాజరు కావాలని కోరారు.